
ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకాదేవి పురాణము

## అష్టమాధ్యాయము

సాలంకాయన మహర్షి మణిగుప్తాదులకు కుసుమశ్రేష్ఠియొక్క పూర్వ వంశక్రమమును గూర్చియు కుసుమార్యుని రాజ్యపరిపాలనా వైశిష్ట్యమును గూర్చియు తెలిపిన తదుపరి శ్రీవాసవీ కన్యకావతార గాధను గూర్చి యిట్లు చెప్పసాగెను. "నాయనలారా! ఘోరమైన కలియుగమున భయంకర హింస, అంతులేని అధర్మము, నిరంకుశత్వము, స్వార్థపరత్వము మొదలైన దుష్టగుణములు పుడమిలో అపరిమితముగ పెరిగిపోయినవి, భూలోకమునందు క్రోధసంభవులును, కపటులునైన నరాధములు పరధనములను అపహరించుచున్నారు. పరకాంతలతో రమించుచున్నారు. మద్యపానమత్తులై దుష్టులతో గూడి సంచరించుచున్నారు. కంచెయే చేనుమేసినట్లు రక్షకులే భక్షకులగుచున్నారు. సేవకులే తమ యజమానులను అంతమొందించుచున్నారు. భార్యామోహితులైన కుమారులు తల్లిదండ్రులను విడచివేయుచున్నారు. అన్నదమ్ములు ధన సంపదలకొరకు పరస్పరము కలహించుకొనుచు వైరమును పెంచుకొనుచున్నారు.

ధనబలదర్పయుక్తులైన శాసకులు నిరంకుశులై ప్రజాశోషకులై వారి సిరిసంపదలను హరించుచున్నారు. భువిలో ఎక్కడ చూచినను రక్తదాహమే కనబడుచున్నది. ఎక్కడ విన్నను దీనుల ఆర్తనాదవే వినబడుచున్నది. వర్ణాశ్రమధర్మములు అంతరించిపోసాగినవి. దుష్టత్వము హద్దులు మీరుచున్నది. శిష్టత్వమునకు రక్షణ మృగ్యమైనది. ఈ భయంకర ధర్మగ్లాని త్రిమూర్తులు గమనించిరి. దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు, ధర్మప్రతిష్ఠాపనకు సమయము ఆసన్నమైనదని గ్రహించిరి.



పుత్రకామేష్ఠి యజ్ఞము చేసిన కుసుమశ్రేష్ఠి, కుసుమాంబ దంపతులకు యజ్ఞపురుషుడు, పాయస పాత్రనందించుట

ఆచరింపబూనిన అద్భుత విధానమును గురించి విని త్రిమూర్తులు సంతుష్టాంతరంగులై తమ తమ నెలవులకు వెడలిపోయిరి.

## పుత్రకామేష్ఠి యజ్ఞము - వాసవీ విరూపాక్షుల జననము :

ఇట వైశ్యరాజ్యమును ప్రజానురంజకముగా పాలించుచున్న ధర్మమూర్తియైన కుసుమశ్రేష్ఠికి బహుకాలము వరకు సంతానప్రాప్తి కలుగలేదు. అందువలన అతడు మిక్కిలి సంతాపము చెంది గురువగు భాస్కరాచార్యునితో తన దుఃఖము గూర్చి విన్నవించుకొనెను. అంతట భాస్కరాచార్యుడు వానిని ఓదార్చి "మహారాజా! నీవు దుఃఖింపనవసరములేదు. పూర్వము ఇంద్ర సమానుడైన దశరథమహారాజు సంతానార్థియై వశిష్ఠ మహర్షి ఆజ్ఞచే పుత్రకామేష్ఠియను యజ్ఞమాచరించి రత్నములవంటి నలుగురు పుత్రులను బడసెను. నీవును పుత్రకామేష్ఠినొనర్చి పుత్రపుత్రికలను పొందుము" అని బోధించెను.

అంత కుసుమ శ్రేష్ఠి గురునానతి మేరకు యాగదీక్షను వహించి వేదోక్తవిధితో మహావైభవముగ భాస్కరాచార్యుని ఆధ్వర్యమున సకలబంధుమిత్ర విప్రోత్తమ సమేతుడై పుత్రాకామేష్ఠి మహాయజ్ఞమును నిర్వహించెను. పరాశక్తి సంతోషించి హోమకుండమున ప్రత్యక్షమై నిలచి కుసుమశ్రేష్ఠికి ఒక గొప్ప బంగారు పాయసపాత్రను అందించెను. ఇట్లు పరాశక్తి వరప్రసాదమగు పాయసపాత్రను పొందిన కుసుమశ్రేష్ఠి మహానందభరితుడై ఆ పాయసమును తన భార్యకిడెను. ఆమె పరమభక్తితో దానిని భుజించి కొలదికాలమునకే గర్భము ధరించినది. గర్భవతియైన కుసుమాంబకు నాలుగు మాసములు నిండగనే గర్భరక్షణముకొరకును, శక్తివంతమైన సంతతికొరకును, గృహ్యాసూత్రోక్త ప్రకారము కుసుమశ్రేష్ఠి పుంసవన సంస్కారము చేయించెను. ఏడవమాసమున గర్భస్థ శిశుక్షేమమునకై సౌభాగ్యదాయకమైన సీమంతోన్నయన సంస్కారము జరిపించెను.

అనంతరం వైశాఖమాసమున పునర్వసు నక్షత్రమున మంగళకరమైన శుక్రవారము నాడు శుక్లపక్ష దశమియందు శుభగ్రహములతో కూడియుండు శుభలగ్నమునందు ఉచ్చస్థములై యుండు మూడుగ్రహములు శుభదృష్టితో నొప్పియుండగ ఆకాశములో కోటిసూర్యప్రభాభాసమానమైన ఒక మెరుపు మెరిసినది. కుసుమాంబ మందిరము దుర్నిరీక్ష్యమైన వెలుగుతో నిండిపోయినది. ఆ మందిరమునగల వారందరును ఆ కాంతిని చూడజాలక ఒక్కక్షణము కన్నులు మూసుకొనిరి. కుసుమాంబకు తన గర్భమునండి రెండు దివ్యజ్యోతులు బయల్వెడలినట్లు విచిత్రానుభూతి కలిగినది. అందరును కనులుతెరచు సరికి కుసుమాంబతల్పముపై కోటి పూర్ణిమల కాంతులతో వెలుగుచున్న యిరువురు పసికందులు కన్పించిరి. రాజుకు ఒక కుమార్తెయు, ఒక కుమారుడును కవలలుగ జన్మించిరన్న వార్త క్షణములో నగరమంతటను వ్యాపించెను. కుసుమశ్రేష్ఠి పుత్ర పుత్రికలను జూచి ఆనందసాగరమున దేలియాడెను. కుసుమాంబకు ఆ బాలిక తమ ఇలవేల్పైన పరాశక్తిగను, బాలుడు ఈశ్వరుడుగను గోచరించి సంభ్రమాశ్చర్యములను కలిగించిరి. కుసుమశ్రేష్ఠి ఆ బాలిక




కుసుమాంబ కుసుమ శ్రేష్ఠికి, కవలపిల్లలు జన్మించుట

తేజోమయియు, దివ్యరూపిణియు, చతుర్భుజోపేతయు, శుకపద్మపాశ విపంచికలను ధరించినదియు, చంద్రకోటి సమకాంతితో వెలుగుచున్నదియు, బహువిధ దివ్యాభరణ భూషితయు, రత్నకాంచన కిరీట ధారిణియు, సువర్ణవర్ణోజ్వల లతాతన్వియునగు పరాంబికగ సాక్షాత్కరించినది. ఆ దేవదేవిని చూచి కుసుమశ్రేష్ఠి ఆశ్చర్యచకితుడయ్యెను. అంతనాదేవి వానికి దివ్యజ్ఞానమును ప్రసాదించి గంభీరవాక్కులతో "నాయనా! నీకు మంగళమగుగాక. నీవు పూర్వజన్మమున సమాధి అనువాడవు. నాటి నీ అమోఘమైన తపోబలాతిశయముతో వరమంది అఖిలలోకేశ్వరినైన నన్ను నేడు కుమార్తెగ పొందగలిగితివి." అని పలికి ఆ దివ్యరూపిణి అంతర్ధానయైనది. తోడనే మాయచే కప్పబడిన కుసుమశ్రేష్ఠి దానిని స్వప్నసమానముగ భావించి ప్రాకృత మానవునివలె మోహితుడయ్యెను. కుసుమశ్రేష్ఠి ఆజ్ఞచే పెనుగొండలోని సమస్త దేవాలయములలో అర్చనాదిక మహోత్సవములు జరుపబడినవి. విప్రోత్తములకు షోడశ

మహాదానములొసగబడినవి. నగరి పెనుగొండ ఆనంద కోలాహలముతో నిండిపోయినది.

## వాసవీ విరూపాక్షులకు జరిగిన బాల్య సంస్కార విధులు :-

అంత భాస్కరాచార్యుడు నవజాత శిశువులకు నాభిచ్ఛేదము చేయించి మధుఘృతసిక్తమైన స్వర్ణశలాకతో బిడ్డలనాల్కలపై ఓంకారమువ్రాసి వారికి విధ్యుక్తముగ జాతకర్మసంస్కారము చేయించెను. ఆ శిశువుల జన్మించిన పదునొకండవ దినమున కుసుమశ్రేష్ఠి వైభవపేతముగ వారికి నామకరణ సంస్కారము చేయించుటకై ఏర్పాట్లు గావించెను. భాస్కరాచార్యుడును, రాజజ్యోతిష్యులును మహాతేజోవంతులైన ఆ బిడ్డల జాతకములు ఊహాతీత విశేషములతో నొప్పియుండుటను పరికించి, కుసుమాంబకు కలిగిన దివ్యానుభూతులను గురించి తెలుసుకొని ఆ బాలబాలికలకు ఏ పేర్లు పెట్టవలయునా? అని దీర్ఘాలోచనా నిమగ్నులై యుండగ సహస్రాధిక మధుర మంజుల వీణానినాద సదృశమైన ధ్వనితో ఆకాశము నుండి ఒక అశరీరవాణి యీవిధముగ వినిపించినది. "పూర్వము యీ బాలిక విష్ణువగు వాసుదేవునకు సోదరియై ఆవిర్భవించినదిగాన ఈమె "వాసవి" అను పేర ప్రసిద్ధురాలగును. మరియు పూర్వము యీ దేవి విష్ణువుచే యోగమాయాకన్యకగ కీర్తింపబడినది గాన "కన్యక" యను పేరుతో గూడ యీ బాల ప్రసిద్ధురాలౌను" యిట్లు పలికిన ఆ అశరీరవాణి వాక్కులను విన్న భాస్కరాచార్యాది పండితవర్యులు ఆ బాలికకు "వాసవీకన్యకయని" నామకరణము గావించిరి. విరూపాక్ష తేజముతో విరాజిల్లుచున్న బాలునకు "విరూపాక్షుడని" పేరు బెట్టిరి. ఆ ఇరువురు బిడ్డలు దినదినాభివృద్ధి నొందుచు తల్లిదండ్రులకు, బంధుమిత్రులకు పరమానందమును కలుగజేసిరి.



భాస్కరాచార్యులు, అమ్మవారికి వాసవియని అబ్బాయికి విరూపాక్షుడు అని నామకరణము చేయుట

ఆ శిశువులకు మూడు మాసములు నిండిన పిదప నిష్క్రమణ సంస్కారమును, ఏడు మాసములు నిండిన తరువాత వారికి అన్నప్రాశన సంస్కారమును కుసుమ శ్రేష్ఠి మిక్కిలి వైభవముగ చేయించెను. లేకలేక కలిగిన వాసవీ విరూపాక్షులు మూడేండ్లు వయస్సు కలవారైనారు. అంత కుసుమార్య ప్రభువు వారికి కర్ణవేధ సంస్కారము చేయించెను. ముద్దులు మూటగట్టు అందచందములతో బాల్యచేష్టలతో విరాజిల్లుచున్న వాసవీ విరూపాక్షులను చూచిన వారందరును హర్షపులకాంచిత దేహులై మురిసిపోసాగిరి. వాసవీ బాలయందు ఆ పసితనములోనే పలువిధములైన దివ్యలక్షణములు గోచరింపసాగినవి. ఆ బాలికయొక్క అద్భుతలీలలు, క్రీడలు ఎల్లరిని ఆశ్చర్యసాగరములో ముంచి వేయసాగినవి."

అని చెప్పిన సాలంకాయన ఋషి వలన వాసవీ విరూపాక్షుల జన్మవృత్తాంతమును వారికి జరిగిన సంస్కారాది విశేషములను విన్న మణిగుప్తాదులు


తమ గురువుతో" ఆచార్యవర్యా! మీ నుండి మహత్తరములైన విషయములను విని ధన్యులమైతిమి. పసితనములోనే వాసవీబాల యొక్క క్రీడలు, లీలలు ఎల్లరిని ఆశ్చర్యసాగరమున ముంచివేసినవని చెప్పిరి కదా. ఆ వాసవీబాల చూపిన విచిత్రలీలలెట్టివో? ఆమె బాల్యవిశేషములెట్టివో? దయచేసి మాకు సవివరముగ వినిపింపుడు" అని ప్రార్థించిరి.

## బాలవాసవి చూపిన అద్భుతలీలలు :-

అంత సాలంకాయనుడు వారితో ఓవత్సలారా! మీ కుతూహలము నాకు మిక్కిలి సంతోషమును కలిగించినది. శ్రీవాసవీదేవి బాల్యలీలలను భక్తియుక్తులై అవధరింపుడు అని యిట్లు చెప్పసాగెను. "లేకలేక కలిగిన వాసవీ విరూపాక్షులను కుసుమాంబా, కుసుమశ్రేష్ఠులు ఎనలేని గారాబముతో పెంచసాగిరి. మూడేండ్ల ప్రాయము గల బాలవాసవి అన్నముతినక మారాము చేయసాగినది తల్లి కుసుమాంబ ఆ బాలికకు పలువిధములైన కథలు చెప్పుచు, తీయని మాటలతో అన్నము తినిపించుటకు ప్రయత్నించినది. కాని ఎంత ప్రయత్నించినను వాసవీ బాలిక నోరు తెరువకుండుట వలన కుసుమాంబ విసుగుచెంది నోరు తెరువమని బిడ్డను గట్టిగ గద్దించినది. బాలికచేత బలవంతముగ నోరుతెరిపించి చూచి స్తబ్దురాలైనది. బాలవాసవి నోటిలో బ్రహ్మాండమంతయు కుసుమాంబకు కన్పించినది. సమస్త జీవగణములు, గరుడోరగయక్షరక్షోగణములు, ఖడ్గమృగాది సకలజీవులు, సమస్తగ్రహ గోళములు, గిరివనమహాజలనిధులాదిగా గల చరాచర సృష్టియంతయు ఆ చిన్నారి వాసవినోటిలో కుసుమాంబకు దృగ్గోచరమైనది. ఆ తల్లికి ఆ బాలిక ఆదిపరాశక్తివలె కనిపించినది. అనిర్వచనీయమ్మైన ఆశ్చర్యసాగరములో కుసుమాంబ మునిగిపోయినది. అప్రయత్నముగ తన చేతులు జోడించి ఆ బాలకు నమస్కరించినది. ఆమె కన్నుల నుండి

అద్భుతానంద పూరితములైన అశ్రుధారలు ప్రవహించినవి. వాసవీబాలిక మురిపములుకురియు చిరునగవు లొల్కించినది. అంతలో కుసుమాంబను మాయ ఆవరించినది. ఆమెకు ఏదో స్వప్నముగాంచి మేల్కొన్నట్లు అనిపించినది. ఆమెను మోహము ముంచివేసినది. తోడనే చిన్నారి వాసవిని తన హృదయమునకు హత్తుకొని విభ్రమచిత్తురాలైనది. ఇంతలో కుసుమశ్రేష్ఠి భాస్కరాచార్యునితో గూడి అక్కడికరుదెంచెను. కుసుమాంబ జరిగిన ఉదంతమంతయు వివరించగ, ఆ విషయములను విన్నవారందరు అబ్బురపడిరి. అమాయకముగ చూచుచున్న యోగమాయా కన్యయైన బాలవాసవిని పరికించి, ఆమె నిజతత్త్వమహత్త్వమును వూహించి భాస్కరాచార్యుడు భక్తియుక్తుడై పరవశించెను. అది ఏదోగ్రహ ప్రభావమని భావించిన కుసుమశ్రేష్ఠి ఉపశాంతికై శాంతికార్యక్రమములను చేయింపుడని మంత్రులను ఆదేశించెను. ఆదిపరాప్రకృతియు, సమస్త సృష్టిని తనయందు ఇముడ్చుకొని యున్న విశ్వమాతయగు పరాశక్తియు తనే అన్న రహస్య తత్త్వమును పసితనములోనే వాసవీకన్యక తనతల్లికి యీ విధముగ విశదపరచినది.

బాలవాసవి చూపిన మరియొక మహత్తరలీలను మీకు వివరించెదను. సావధానులైవినుడు. బాలవాసవికి ఐదేండ్ల ప్రాయము వచ్చినది. అది శరన్నవరాత్రి మహోత్సవముల సమయము. పరాంబికను అర్చించుటకై రాజుగారి పూజామందిరమున దేవీపీఠము ఏర్పరుపబడినది. ఆ పీఠమున నిలుపుటకై కుసుమ శ్రేష్ఠి లలితాదేవియొక్క సువర్ణప్రతిమను తయారుచేయించి యుంచెను. ఆ దివ్యమంగళ ప్రతిమను అలంకరించుటకై సర్వాభరణములను, పుష్పమాలలను సిద్ధపరచి మిగిలిన ఏర్పాట్లకై కుసుమాంబా, కుసుమశ్రేష్ఠులు బయటకు వెళ్ళిరి. ఇంతలో పంచవర్షప్రాయమైన బాలవాసవి ఆ పూజా మందిరములోనికి ప్రవేశించినది. అపుడా మందిరములో ఎవ్వరును



బాలవాసవి పూజా మందిరమున కూర్చుండి కుసుమాంబ కుసుమార్య, భాస్కరాచార్యులందరికి తన దివ్య భవ్య స్వరూపములను జూపి లీలా ప్రదర్శనము గావించుట

లేకుండిరి. బాలవాసవి హారకేయూరకిరీటాదులైన సమస్తాభరణములను పుష్పమాలలను తానే చక్కగ ధరించివెళ్లి పూజాపీఠముపై కూర్చొని వరదాభయహస్తముద్రలు ప్రకటించుచు విలాసముగ చిరునగవులొల్కించసాగినది. అంతట లలితాదేవీ విగ్రహమును అలంకరించి, పూజాపీఠముపై ప్రతిష్ఠించి విధ్యుక్తముగ అర్చించుటకై తగు ఏర్పాట్లతో కుసుమాంబాకుసుమశ్రేష్ఠులు గురువుతోను, పరివారముతోను కూడి మందిరములోనికి వచ్చిరి. అక్కడ పూజాపీఠముపై బాలాత్రిపురసుందరివలె కూర్చొనివున్న బాలవాసవిని చూచి ఆశ్చర్యచకితులైరి. రాజదంపతులు అమ్మో అపచారము జరిగినదని భీతిల్లసాగిరి. ఇంతలో వారికి ఆ వాసవీబాలిక మహాలక్ష్మీవలె, మహాసరస్వతివలె, మహాకాళివలె గోచరించినది. అక్కడనున్న వారిలో కొందరికి దుర్గగ, మరికొందరికి చండికగ, కొందరికి కృష్ణుడుగ, మరికొందరికి రాముడుగ, ఇంకకొందరికి

వింధ్యవాసినిగ వారివారికి యిష్టములైన దేవతారూపములతో వాసవిబాల సాక్షాత్కరించినది. భాస్కరాచార్యునకు యోగమాయాకన్యగ కనిపించినది. ఈ అద్భుతమును చూచి ఎవరికి వారు భక్తిపరవశులై జయఘోషలు సల్పుచు వాసవీబాలకు పలుమార్లు నమస్కరించిరి. అంతలోనే వారు మాయచే ఆవరింపబడిరి. క్షణములో వారికి కనబడుచుండిన దేవతారూపములు అదృశ్యములై బాలవాసవి దృగ్గోచరమైనది. కుసుమాంబ పరుగునబోయి బాలికను పీఠమునుండి తీసుకొనివచ్చి భీతచిత్తయై గురువర్యుడైన భాస్కరాచార్యుని వైపునకు చూచినది. ఆచార్యుడు చిరునవ్వు నవ్వి, "ఓ కుసుమాంబా! కుసుమశ్రేష్ఠులారా! మీగత జన్మల పుణ్యము అనంతము. మీరు అమేయ మహిమాన్వితురాలైన కుమార్తెను బొందియున్నారు. ఆదిపరాశక్తి తన ప్రధాన రూపము లన్నింటిని యీ వాసవీ బాలయందు మనచేత దర్శింపజేసినది. మనమందరమును ధన్యులమైనాము." అని పలికి అటుపై లలితాదేవి ప్రతిమనలంకరించి, పూజాపీఠమున ప్రతిష్ఠించి శాస్త్రోక్త విధితో అర్చనాదిక మహోత్సవమును నిర్వహించెను. బాలవాసవీ లీలలను గూర్చి ఆంధ్రదేశమందంతటను చిత్రవిచిత్రములైన చర్చలు కొనసాగినవి.

ఇట్లు వాసవీబాల తన బాల్యములోనే అనేక దివ్యలీలలను ప్రదర్శించినది అని చెప్పిన సాలంకాయనుని మాటలు విని మణిగుప్తాదులు పరవశులైరి. వారత్యంత కుతూహలముతో "ఓ గురూత్తమా! మీకృపవలన అద్భుతములైన విషయములను విని ధన్యులమైనాము. తదుపరిగాధను దయతో చెప్పుడు" అని ప్రార్థించిరి.

అంత సాలంకాయనుడీవిధముగ చెప్పసాగెను. "వత్సలారా! క్రమముగ వాసవీ విరూపాక్షులు అష్టవర్షములు నిండినవారైరి. కుసుమశ్రేష్ఠి వారిరువురకు గురుభాస్కరుని ప్రేరణచే ఉపనయన సంస్కారము చేయించెను. ఉపనయనమనగా వేదవిద్యా సముపార్జనమునకై గురువుయొద్దకు కొనిపోవుట యనిభావము. ఈ

ఉపనయనానంతరమే అగ్నిహోత్రము వ్రేల్చుటకును యజ్ఞమయ జీవనమును ప్రారంభించుటకును అధికారము లభించును. ఉపనయనములో వటువులు యజ్ఞోపవీతధారణ చేయుదురు. యజ్ఞోపవీతములోని మూడువరుసలు జ్ఞానకర్మోపాసనలకు చిహ్నములు. జీవుడు శరీరధారియగుటకు తల్లిగర్భమున ప్రవేశించును. అదిజీవికి తొలిజన్మము. పిమ్మట జ్ఞానర్జనమునకై గురుకులరూపమైన ఆచార్యునిని గర్భములో ప్రవేశించును. అక్కడ యజ్ఞోపవీతధారియై ద్విజన్ముడగును. అటుపై గురువు వానికి గాయత్రీ మంత్రోపదేశముగావించి, వేదవేదాంగములను బోధించును. ఇది వేదారంభ సంస్కారమనబడును. ఈ సంస్కారమును పొందిన తరువాతనే మానవుడు బ్రహ్మచర్యాశ్రమమున ప్రవేశించి సదాచారానుష్ఠానమును సాగించును.

శృతిస్మృతులలో మొట్టమొదటి ముఖ్యమైన ధర్మము సదాచారమని చెప్పబడినది. సదాచారము వలననే చిరాయువు, చిరంజీవమైన సంతతి, మరియు సమస్త సుగుణముల అభివృద్ధి ప్రాప్తించును. సదాచారము సర్వపాతక నాశనము, ఇహపరసుఖదాయకరము, అజ్ఞాన మోహాంధకారమునబడి కొట్టుమిట్టాడు వారికి వెలుగుబాటను జూపించు కరదీపము, సదాచారము వలన సత్కర్మ చేకూరును. సత్కర్మ వలన చిత్తశుద్ధియు, దానివలన జ్ఞానమును కలుగును. జ్ఞానము వలన ముక్తి లభించునని మనువు చెప్పెను. సకల ధర్మములలో సదాచారము శ్రేష్ఠమైనది. అదే పరమతపస్సు అని సాలంకాయనుడు సదాచార మహిమను గూర్చి మణిగుప్తాదులకు తెలియజేసెను.